ప్రజాశక్తి
శుక్రవారం 22 డిసెంబర్ 2023
5
పార్వతీపురం మన్యం



ఏజెన్సీలో పెరిగిన చలి ప్రభావం

కనిష్టం11.. గరిష్టం 28 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యంలో గత ఐదు రోజుల నుంచి చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం 6 గంటల నుంచి మొదలైన మంచు మరుసటి రోజు ఉదయం 9 గంటల వరకు కురుస్తుంది. దీంతో ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు కనిష్టం 11, గరిష్టం 28 డిగ్రీలు నమోదు అవుతుంది. చలి తీవ్రతను తట్టుకునేందుకు గిరిజన గ్రామాల్లో ప్రజలు చలి మంటలు వేసుకుని వెచ్చదనం పొందుతున్నారు. ఉదయం 7 వరకు పొగ మంచు కురవడంతో లైట్లు వేసుకొని వాహనాలు ప్రయాణిస్తున్నారు. మంచు ప్రభావం కారణంగా జలుబు, దగ్గు లక్షణాలతో ఆసుపత్రులకు వెళ్తున్నారు. ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

తెలుగు తమ్ముళ్లలో నూతనుత్తేజం

- జనసేనలోనూ పెరుగుతున్న జోష్
- యువగళం సభ సక్సెస్‌తో ఇరు పార్టీల్లోనూ రాజకీయవేడి
- సమన్వయంపైనే సందేహం



యువగళం బహిరంగసభకు హాజరైన టిడిపి, జనసేన కార్యకర్తలు (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

యువగళం సభ సక్సెస్ కావడంతో తెలుగు తమ్ముళ్లలో నూతనుత్తేజం కనిపిస్తోంది. అటు జనసేన పార్టీలోనూ జోష్ పెరుగుతోంది. నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలంటూ టిడిపి, జనసేన అధినేతలు నారా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేయడంతో ఇరు పార్టీల్లోనూ రాజకీయ వాతావరణం వేడెక్కింది. భోగాపురం మండలం పోలిపల్లిలో బుధవారం నిర్వహించిన యువగళం-నవశకం సభకు ఇరు పార్టీలకు చెందిన నాయకులు జిల్లా నలుమూల నుంచి తరలి వచ్చారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల చెందిన నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు. జిల్లాలో మునుపెన్నడూ జరగనంత తీరులో జరగడంతో ఆయా పార్టీల కేడర్ ఆనందోత్సవంలో ఉన్నారు. కానీ... ఆచరణలో ఇరు పార్టీలకు చెందిన నాయకుల మధ్య సమన్వయం ఎలా ఉంటుందో అన్నదానిపై సందేహాలు వ్యక్తమౌతున్నాయి. జిల్లా అంతటా కాకపోయినా కొన్నిచోట్ల జనసేన నాయకులు ఉన్నారు. వీరిలో కొంతమంది ఎన్నికల్లో పోటీకి తహతహలాడుతున్నారు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ టిడిపి ఆశావహులు ఇప్పటికే చాపకింద నీరులా ఎన్నికల వ్యూహంతో పనిచేస్తున్నారు. జనసేన తరఫున విజయనగరంలో పాలవలస యశస్విని గత ఎన్నికల్లో పోటీచేసిన సంగతి తెలిసిందే. తాజాగా పొత్తు కారణంగా ఆమె స్థానం ప్రశ్నార్థకంగా మారింది. ఒకవేళ ఆమెకు టిక్కెట్ దక్కకపోతే విజయనగరంలో టిడిపికి సహకరిస్తారా? ఆమె రాజకీయ భవితవ్యం ఏమిటి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నెల్లిమర్ల నుంచి గతంలో పోటీకి దిగిన లోకం మాధవి కూడా మళ్లీ పోటీకి ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఇదే నియోజకవర్గం నుంచి టిడిపి తరపున కర్రోతు బంగార్రాజు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇద్దరూ టిక్కెట్టు ఆశిస్తున్నారు. తీవ్ర ప్రయత్నాలు కూడా చేసుకుంటున్నారు. అనివార్య కారణాల వల్ల వీరుకాకుండా ఇతరుల పేర్లు తెరమీదకు వచ్చినా పరస్పర సహకారం ఏమేరకు ఉంటుందో అన్న ప్రశ్న చర్చించుకుంటున్నారు. పొత్తులో భాగంగా జిల్లాలో ఏ నియోజకవర్గంలో జనసేన పోటీకి అవకాశం దక్కుతుందో అన్న చర్చకూడా నడుస్తోంది. ఆశావహుల్లో ఇరు పార్టీల్లోనూ అసంతృప్తులతో నాయకులు బయటపడితే దాన్ని అనుకూలంగా మలుచుకునేందుకు వైసిపి పావులు కదుపుతోంది. ఇటువంటి రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు అంచనాలు వేసుకుంటూ సమన్వయంతో ముందుకు నడిపే నాయకులు టిడిపిలో లేరనే వాదన వినిపిస్తోంది. పూసపాటి అశోక్‌గజపతిరాజు టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఉన్నప్పటికీ మండలం, నియోజకవర్గ స్థాయిలో కిందికి దిగి సమన్వయం చేసేంత ఓపిక, సహనం లేదని ఇటు టిడిపి, జనసేన పార్టీలకు చెందిన నాయకులు చెబుతున్నారు. ఇలాంటి బలహీనతల వల్లే యువగళం సభలోనూ మాజీ స్పీకర్ ప్రతిభా భారతి మినహా జిల్లా నుంచి ఎవరికీ మాట్లాడేందుకు కూడా అవకాశం ఇవ్వలేదన్న చర్చ నడుస్తోంది.

ఓటరు జాబితాలో మార్పులపై నివేదిక

ఓటరు జాబితా పరిశీలకులు శ్యామలరావు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురించిన అక్టోబర్ 27 నుంచి ఇప్పటి వరకూ అందులో చేసిన మార్పులు, చేర్పులు, ఇతర సవరణలకు గల కారణాలతో నివేదికలు రూపొందించాలని ఎన్నికల రోల్ అబ్జర్వర్, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు అన్నారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన ఓటరు నమోదు అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఫారం 6,7,8 దరఖాస్తుల ఆధారంగా ఓటర్ల జాబితా రూపకల్పనలో అవలంబిస్తున్న విధానాల గురించి, చేపడుతున్న చర్యల గురించి అసెంబ్లీ నియోజకవర్గాలు, పోలింగు కేంద్రాల వారీగా సమీక్షించారు. జనాభా - ఓటరు నిష్పత్తిలో తేడాల్లేకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కువ నిష్పత్తిలో ఉంటే కారణాలు విశ్లేషించాలని సూచించారు. ఈ సందర్భంగా రోల్ అబ్జర్వర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తు పక్కాగా విచారణ జరగాలని, ఎండార్స్‌మెంటు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. విచారణకు సంబంధించిన పత్రాలు నిర్దిష్టంగా ఉండాలని, చేర్పులు మార్పులు జరిగితే వాటి వివరాలు స్పష్టంగా ఉండాలని అన్నారు. మృతి చెందిన ఓటర్ల తొలగింపు ప్రక్రియ పక్కాగా చేపట్టాలని, సంబంధిత పత్రాలు ఉండాలని అన్నారు. ఓటరు నమోదు, సవరణ ప్రక్రియ పక్కగా చేపట్టి తప్పులేని ఓటరు జాబితా రూపకల్పన చేయాలన్నారు. డిసెంబరు 26 వరకు అందిన అభ్యంతరాలు, క్లైమ్ లు పరిష్కరించి తప్పుల్లేని తుది ఓటరు జాబితా ప్రకటించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జెసి ఆర్. గోవిందరావు మాట్లాడుతూ అందిన ప్రతి ఫిర్యాదును విచారిస్తున్నామన్నారు. మృతి చెందిన ఓటర్ల వివరాలు ఓటరు నమోదు అధికారి విధిగా పరిశీలించాలని ఆదేశించామనిచెప్పారు. ఆరోగ్యవంతమైన ఓటరు జాబితా తయారీకి కృషి చేస్తున్నామన్నారు.



ఓటు నమోదు దరకాస్తులను పరిశీలిస్తున్న ఎన్నికల రోల్ అబ్జర్వర శ్యామలరావు

ఫారం 6,7,8 దరఖాస్తుల పరిశీలన

సమావేశం అనంతరం ఓటర్ల జాబితా పరిశీలకులు ఒక్కో నియోజకవర్గం నుంచి అయిదు పోలింగు కేంద్రాలకు చెందిన దరఖాస్తులను పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో సేకరించిన ఫారం 6, 7, 8 దరఖాస్తులను తనిఖీ చేశారు. సమావేశంలో డిఆర్ఒ జె.వెంకటరావు, ఓటరు నమోదు అధికారులు - సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పిఒలు కల్పనాకుమారి, సి.విష్ణు చరణ్, పార్వతీపురం, పాలకొండ ఆర్‌డిఒలు కె. హేమలత, ఎం.లావణ్య, కెఆర్‌ఆర్‌సి ఎస్డిసి జి.కేశవనాయుడు, ఎలక్షన్ సెక్షను సూపరింటెండెంటు రవికుమార్ పాల్గొన్నారు.

తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రైతుల నుంచి తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. మండలంలోని రామవరం, ఆర్.వెంకంపేట, కాశాపేట, చినభోగిల తదితర గ్రామాల్లో పర్యటించి ధాన్యం కొనుగోలు లేక రైతులు పడుతున్న అవస్థలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అధికారులు చెప్పిన మాటలకు చేసిన పనులకు పొంతన లేదని, ప్రభుత్వం దళారులను పోషిస్తుందని విమర్శించారు. రైతుల నుంచి 84 కేజీలు ధాన్యాన్ని రూ.1300 నుండి రూ.1500కు దళారులు కొంటున్నారన్నారు. ఇలా అమ్మడానికి కారణం రైతులకు సకాలంలో ట్రక్కు సీట్లు తెగకపోవడంతో భయపడి దళారులను ఆశ్రయిస్తున్నారన్నారు. రైతులు ధాన్యం కోసం ట్రక్ షీట్ల కోసం ఆర్‌బికెల చుట్టూ తిరగడమే తప్ప పనులు చేయడంలేదన్నారు. బిజీల్లేవని మిల్లు యజమానులు, ఆర్‌బికె సిబ్బంది తెలుపుతున్నారన్నారు. దళారులకు, వ్యాపారస్తులకు, మిల్లరులకు అనుసంధానంగా ఆర్‌బికె పనిచేస్తున్నాయని విమర్శించారు. అసలు బిజీలు కట్టించాల్సిన బాధ్యత సివిల్ సప్లై అధికారులపై ఉన్నా శ్రద్ధ చూపలేదని తెలిపారు. గతంలో మండలం యూనిట్‌గా తీసుకొని అదే మండలానికి మిల్లర్లకు ధాన్యాన్ని పంపిస్తామన్నారని, కానీ అలా జరగడం లేదని అన్నారు. ఇప్పుడు దూర ప్రాంతాలకు తరలించాల్సిన పరిస్థితి ఉండడం వల్ల రవాణా ఛార్జీలు రైతులపై పడుతున్నాయన్నారు. తుపాను సందర్భంగా కొన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలుపై హడావిడి చేసిని అధికారులు, ఇప్పుడు ధాన్యం కొనుగోళ్లపై శ్రద్ధ చూపలేదని అన్నారు. కళ్లాల్లో ధాన్యం నెట్లుగా ఉన్నాయని, వాటిని తక్షణమే ఆర్‌బికె ద్వారా కొనుగోలు చేయాలని, లేనిచో రైతులతో ఆర్‌బికెల వద్ద ఆందోళన చేపట్టాలని రైతులకు పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, జిల్లా నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, కౌలు రైతు సంఘం నాయకులు రెడ్డి రమణమూర్తి పాల్గొన్నారు.

పది రోజులైనా... పట్టదా?

ప్రభుత్వ తీరును నిరసిస్తున్న అంగన్‌వాడీలు
పలుచోట్ల మానవహారాలు, ఒంటికాలిపై నిల్చొని ఆందోళన



పాలకొండలో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పది రోజులుగా సమ్మె చేస్తుంటే పాలకులకు కనీసం చీమకుట్టినట్టయినా లేదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, ప్రాజెక్టు లీడర్స్ మద్రాపు అలివేలు, సాలూరు గౌరీమణి ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఎదురుగా నిరసన శిబిరాన్ని నిర్వహిస్తున్న అంగన్వాడీలు పదో రోజు సమ్మెలో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట మానవహారం నిర్వహించి తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, నాయకులు బొత్స లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్, ఎఐసిసిటియు రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, పట్టణ నాయకులు సంగం, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సెక్టార్ నాయకులు టి.రాజేశ్వరి, బి.నీలవేణి, పార్వతి, ధర్మావతి, కె.రాజేశ్వరి, ఎం.గౌరి, బి.శాంతి, బి.సునీత, కల్పన, జయలక్ష్మి, జ్యోతి, అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సాలూరు : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పట్టణ, మండల నాయకులు బి.రాధ, ఎ.నారాయణమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు బోసుబొమ్మ జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. డిమాండ్లు ఆమోదించే వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్యామల, వరలక్ష్మి, తిరుపతమ్మ, పార్వతి, శశికళ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : సమ్మెలో భాగంగా గుమ్మలక్ష్మీపురంలో అంగన్వాడీలు ఒంటి కాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సత్యవతి, కస్తూరి తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, కోశాధికారి మండంగి రమణ ఉన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీలో చేపడుతున్న నిరవధిక సమ్మెకు సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అంగన్వాడీలకు తెలంగాణ కంటే అదనంగా జీతం చెల్లిస్తామని చెప్పిన జగన్‌మోహన్ రెడ్డి ఇప్పుడు ఆహామీని తుంగలో తొక్కడం దారుణమన్నారు.అనంతరం అంగన్వాడీలు మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం సభ్యులు వి.రామలక్ష్మి, సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ నాయకులు సత్యవతి, యశోద, సునీత, శైలజ, రెడ్డి లక్ష్మి తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొమరాడ : అంగన్వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, ప్రభుత్వం దిగివచ్చే వరకూ పోరాటం ఆగదని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట జ్యోతి అన్నారు. సమ్మెలో బాగంగా స్థానిక మెయిన్ రోడ్డు వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ కొమరాడ ప్రాజెక్టు ఉపాధ్యక్షులు సిరికి అనురాధ, సెక్టార్ లీడర్ బి.అలివేలు, జ్యోతి, పద్మ, మల్లేశ్వరమ్మ, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల నుంచి అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



సీతంపేటలో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ముఖద్వారం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధి సమ్మె గురువారానికి పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు, మండల కార్యదర్శి ఎం.కాంతారావు, అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు ఎ.పార్వతి, ఎ.దర్శమ్మి మాట్లాడారు. కార్యక్రమంలో అంజలి, అరుణ కుమారి, ఈశ్వరి, తిక్కమ్మ, గౌతమి, ఆదమ్మ, ప్రియా, సిఐటియు మండల అధ్యక్షులు పి.సాంబయ్య, పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక ధూళికేశ్వరాలయం సమీపాన పధాన రహదారి వద్ద అంగన్వాడీలు మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో కురుపాం, జియ్యమ్మవలస మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాచిపెంట : సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు తలపెట్టిన సమ్మె పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ నాయకులు టి.ప్రభావతి, పైడ్రాజు, రమణమ్మ, సాయి, పూజ, రమాదేవి ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, జిల్లా ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మంచాల శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు. సుర్రు రామారావు, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బలిజిపేట : స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో అంగన్వాడీలు మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీలు చేపడుతున్న సమ్మెకు స్పందించకపోతే తదుపరి కార్యాచరణ చేపడతామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వంజరాపు సత్యంనాయుడు, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షులు కె.దాలమ్మ, అరుణ, సావిత్రమ్మ, పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



బలిజిపేటలో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

గరుగుబిల్లి: సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు చేపట్టిన సమ్మెలో భాగంగా భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, మండలంలోని అంగన్వాడీలు,హెల్ప ర్ లు అధిక సంఖ్యలో పాల్గొ న్నారు.

పాలకొండ : స్థానిక కోటదుర్గ గుడి సెంటర్‌లో అంగన్వాడీలు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు అంగన్వాడిల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఉద్యమం ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్. హిమప్రభ, పాలకొండ ప్రాజెక్టు అధ్యక్షులు జి జెస్సి బాయ్, కె.లలిత, టి.భారతి, కె.సీతమ్మ, జి.శారద, ఆర్.జయలక్ష్మి, కె.ప్రమీల, కె.కళావతి తదితరులు పాల్గొన్నారు.



సీతానగరంలో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

చంద్రబాబు మాయలో పడొద్దు

పవన్ కల్యాణ్‌కు విలువల్లేవు
విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీలో డిప్యూటీ సింఎం

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మాయమాటలు నమ్మి మోసపోవద్దని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర కోరారు. గురువారం సిఎం జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా 8తరగతి విద్యార్థినులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో టిడిపి హయాంలో చంద్రబాబు నాయుడు సిఎంగా ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయలేదని చెప్పారు. రైతులు, మహిళలకు రుణమాఫీ చేస్తామని చెప్పి నిలువునా మోసం చేసిన ఘనత బాబుదేనని అన్నారు. టిడిపి నాయకుల మాటలు నమ్మితే మళ్లీ మోసపోతారని చెప్పారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు రాజకీయ విలువల్లేవని విమర్శించారు. టిడిపి ప్రభుత్వం హయాంలో రూ.లక్ష కోట్ల దోపిడీ జరిగిందని, పవన్‌కల్యాణ్ సాలూరు పర్యటన సందర్భంగా ధ్వజమెత్తారని గుర్తు చేశారు. లక్షల ఎకరాల భూములు దోపిడీ చేశారని టిడిపి నాయకులపై జనసేనాని దాడి చేశారని చెప్పారు. అలాంటి టిడిపితో ఇప్పుడు జనసేన అధినేత ఏ ముఖం పెట్టుకొని ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తారని ప్రశ్నించారు. గతంలో దోపిడీ టిడిపి ఇప్పుడు నీతివంతమైన పార్టీ ఎలా అయిందని నిలదీశారు. విద్యార్థులు ప్రాథమిక విద్యలో డిజిటల్ అక్కరాస్యత సాధించేందుకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అలాంటి ప్రభుత్వాన్ని వద్దనుకుంటే ప్రజలు తీవ్రంగా నష్టపోతారని రాజన్నదొర అన్నారు. కార్యక్రమంలో డిఇఒ ప్రేమ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, ఫ్లోర్‌లీడర్ గొర్లి జగన్మోహన్‌రావు వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు కౌన్సిలర్లు, కమిషనర్ టి.జయరాం, ఎంఇఒ రాజ్ కుమార్, మక్కువ మండల వైసిపి కన్వీనర్ మావుడి రంగునాయుడు, సాలూరు వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, ఎఎంసి చైర్మన్ దండి అనంతకుమారి, మండల వైసిపి కన్వీనర్ సువ్వాడ భరత్‌శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర


ఘనంగా జగన్ పుట్టిన రోజు వేడుకలు

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బోసుబొమ్మ జంక్షన్‌లో రాజన్నదొర బర్త్‌డే కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర నివాసంలో ఆయన సతీమణి రోజమ్మ పేదలకు బట్టలు పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీల సమ్మెల ప్రస్తావిస్తూ వారి సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం సానుకూల ధృకృథంతోనే ఉందన్నారు. రాష్ట్రఆర్థిక పరిస్థితి దృష్ట్యా అంగన్‌వాడీ సంఘాలు ఆలోచించాలని కోరారు. వీరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, త్వరలో దీనికి పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

26 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - సాలూరు

తమ సమ స్యలను పరిష్కరిం చాలని కోరుతూ మున్సి పల్ కార్మి కులు ఈనెల 26 నుంచి సమ్మెకు దిగ నున్నారు. ఈ మేరకు గురువారం మున్సి పల్ వర్క ర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, పట్టణ నాయకులు టి.శంకర్, మహిళా కన్వీనర్ టి.ఇందు ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు మేనేజర్ రాఘవాచార్యులకు సమ్మె నోటీసు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని చెప్పారు. నాలుగేళ్లలో ఒక్క సమస్యను పరిష్కరించలేదని చెప్పారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తానని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



సాలూరు : మేనేజర్‌కు వినతిని అందజేస్తున్న కార్మికులు

పాలకొండ : మున్సిపాల్టీల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, అందుకే ఈనెల 26 నుండి నిరవధిక సమ్మెకు కాంట్రాక్ట్ కార్మికులంతా వెళ్లాల్సి వస్తుందని, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సభ్యులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. స్థానిక నగర పంచాయతీ మస్తరు పాయింట్లో కార్మికులతో మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామని, మున్సిపాల్టీల్లో వచ్చే సమస్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పడాల భాస్కరరావు, సిహెచ్ సంజీవి, సురేష్, పడాల వేణు, వండాన ఆంజనేయులు, విమల, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ హై టీ

ప్రజాశక్తి - పార్వతీపురం

క్రిస్మస్ సందర్భంగా జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్ హై టీ కార్యక్రమాన్ని స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జెసి మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని, వారి బోధనలు శాంతిని ప్రబోధిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఏసుప్రభు గీతాలకు బాలికలు నృత్యం చేశారు. బిషప్ సుదర్శనరావు, తిమోతి ఏసు బోధనలు తెలియజేసారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, ఫాస్టర్లు సుధీర్ చంద్ర, సూర్యప్రకాశ్, ఎన్.జోషప్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ సూపరింటెండెంటు సత్యనారాయణరాజు, ప్రజలు హాజరైనారు.



కేక్ కట్ చేస్తున్న జెసి గోవిందరావు

యువగళం విజయవంతంతో నూతనేత్తేజం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

యువ గళం విజయోత్సవ సభకు 5 లక్షలకు పైగా టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రావడంతో నూతనుత్తేజం నింపిందని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. యువగళం పాదయాత్ర ముగింపు కాదని, ఇది ఒక నూతన నవశకం ప్రారంభాన్ని సూచిస్తుందని అన్నారు. ఒకే వేదికపై చంద్రబాబు , పవన్ కల్యాణ్, లోకేష్ ప్రసంగంతో వైసిపి ప్రభుత్వానికి వణుకు మొదలైందన్నారు. చంద్రబాబు నాయుడు చెప్పినట్లు టిడిపి, జనసేన పొత్తు చారిత్రాత్మకమని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు చాలా అవసరమని అన్నారు. నియోజకవర్గంలో 2024 ఎన్నికల్లో టిడిపి, జనసేన పొత్తుతో టిడిపి జెండా ఎగరడం ఖాయమన్నారు. రానున్న రోజుల్లో కురుపాం నియోజకవర్గంలో వైసిపి ఓటమి ఖాయమని జగదీశ్వరీ పేర్కొన్నారు.

ఇబ్బందుల్లేకుండా ధాన్యం సేకరణ : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తిచేయాలని ఆర్‌డిఒ కె.హేమలత తెలిపారు. మండలంలోని డికె పట్నం కొనుగోలు కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. గోచెక్క రైతులతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్ముకోవాలని తెలిపారు. ధాన్యం అమ్ముకొనేందుకు ఇబ్బందులుంటే అధికారులకు తెలపాలన్నారు. ధాన్యం సేకరణ కేంద్రంలో అవసరమైన గోనె సంచులు సిద్ధం చేసుకోవాలని అధికారులకు తెలిపారు. ధాన్యం సేకరణ కేంద్రం అధికారులు వివరాలు తెలియజేస్తూ ఈరోజు పశ్చిమగోదావరి (తణుకు) శ్రీరామకృష్ణ బాయిల్డ్ ఫ్లోర్, రైస్ మిల్లుకు 50 టన్నులు రవాణా అవుతోందని, ప్రభుత్వం అందించిన వాహనాలే కాకుండా మిల్లు యజమానులు కూడా వాహనాలను అందించడానికి ఆసక్తి చూపుతున్నారని, గోచెక్కలో వారంలోగా వరి కొనుగోలు, రవాణా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి అధికారులు, మండల వ్యవసాయ అధికారి, డీకే పట్నం వివిఎ, రైతులు పాల్గొన్నారు.



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

పెట్రోల్ బంకులో ఉద్యోగాలకు రాతపరీక్ష

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో పాలకొండలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకులో సూపర్ వైజర్, పంపుబాయ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం ఐటిడిఎ మీటింగ్ హాల్లో రాతపరీక్ష నిర్వహించారు. ఒక సూపర్‌వైజర్ ఉద్యోగానికి 52మంది దరఖాస్తు చేసుకోగా 41మంది రాతపరీక్షకు హాజరయ్యారు. 7 పంపుబాయ్ ఉద్యోగాలకు 128 మంది దరఖాస్తు చేసుకోగా 87 మంది రాతపరీక్షకు హాజరయ్యారు. రాతపరీక్షలో ప్రతిభ కనబర్చిన వారికి తదుపరి పరీక్షలు నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిడి జి.మంగవేణి, ఎంఎం పి.కోటిబాబు, జిసిడిఒ రాములమ్మ, శ్రీనివాసరావు, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సురేష్‌కుమార్

91 మందికి నేత్రవైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండువ జంక్షన్ వద్ద గల షిర్డీ సాయి బాబా జ్ఞాన మందిరంలో గురువారం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో నేత్ర వైద్యాధికారి ఆర్.సురేష్ కుమార్ 91మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 39 మందిని నేత్ర చికిత్స కొరకు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన రోగులకు అన్నదానం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోఆర్డినేటర్ సిహెచ్ వెంకటరమణ, క్యాంపు కోఆర్డినేటర్ అర్జున కుమార్, ఆలయ ధర్మకర్త ఎం.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

దండుసురలో పశువిజ్ఞాన బడి

ప్రజాశక్తి - కురుపాం

శీతాకాలంలో పశువులు, మేకలు, మేక పిల్లలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి కె.తేజ అన్నారు. మండలంలోని గుమ్మిడిగూడ పంచాయతీ దండుసురలో పశువిజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించి మేకలు, మేక పిల్లలకు పిపిఆర్ వ్యాక్సిన్ వేశారు. అనంతరం రైతులతో మాట్లాడి చలికాలంలో పశువులు వ్యాధుల బారినపడకుండా పశుశాలలు శుభ్రంగా ఉంచి చల్లగాలులు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు బి.ప్రియాంక రైతులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కిశోర బాలికల్లో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. మండలంలోని ఎంఆర్ నగరం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, రక్త హీనత లక్షణాలు, రోగ నిరోధకశక్తి, పరిశుభ్రతపై ఆరోగ్య అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు (ఇంచార్జి) డి.విజయకుమార్, వైద్య సిబ్బంది డి.పోలమ్మ, పి.పద్మావతి, ఉపాధ్యాయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం పరిశీలన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కడకెల్లలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు పి.సుజాత, ఎఫ్‌పిఒ సిసిపై వై.ఆనందరావు పరిశీలించారు. ప్రకృతి ద్వారా సాగు చేస్తున్న కూరగాయ పంటలను ఎస్‌హెచ్‌జి గ్రూపుల ద్వారా కొనుగోలు చేసేందుకు సభ్యులకు అవగాహన కల్పిస్తామని సుజాత అన్నారు. ఈ కార్యక్రమంలో మండల యాంకర్ మారుతి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు రాగింగ్‌కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - సీతానగరం

విద్యార్థులు రాగింగ్‌కు దూరంగా ఉండాలని ఎస్సై కె.రాజేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. రోడ్డు భద్రత పాటించాలని, వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణ, రామారావు, వినోద్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలోఎంఇఒ తనిఖీ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని మిర్తివలస ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ సామల సింహాచలం గురువారం సందర్శించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయుల డైరీ, లెస్సన్ ప్లాన్స్, వర్క్ బుక్ కరెక్షన్స్ పరిశీలించి సిలబస్ పూర్తి చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వెనుకబడిన విద్యార్థుల కొరకు ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గుల్ల రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

కాలానుగుణంగా ప్రబలే ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేద వైద్యంతో మంచి ఫలితాలు ఉంటాయని ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి.హేమాక్షి అన్నారు. మండలంలోని చిలకాంలో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యాధికారి పలువురికి ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. శీతాకాలంలో సంభవించే అనారోగ్య లక్షణాలున్న వారు ఈ శిబిరాన్ని వినియోగించుకున్నారు. వంద మందికి పైగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆయుర్వేద వైద్యం, వాటి ఆవశ్యకతపై అక్కడ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది పైడితల్లి, పద్మ, రావివలస సిబ్బంది పద్మ, అనిల్, రాముడమ్మ పాల్గొన్నారు.

రెండో రోజుకు సర్వశిక్ష ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

విద్యాశాఖ పరిధిలో గల సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న 18 విభాగాల కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది సమ్మె రెండో రోజు గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా జెఎసి నాయకులు ఎ.పోలినాయుడు, కె.భారతి, బివి రమణ, బి.ఈశ్వరరావు, తదితరులు నిరసన శిబిరాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని గత ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన సిఎం నేటికీ వారి ఉద్యోగ భద్రత, మినిమం టైం స్కేల్, గ్రాడ్యుటీ, పిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు పెంచినప్పటికీ సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులకు జీతాలు పెంచకపోవడం సమంజసం కాదని అన్నారు. సుప్రీంకోర్టు సూచన ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా సర్వ శిక్ష ఉద్యోగులకు వేతనాలు ఈనెల ఒకటో తేదీన చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో విశిష్ట ప్రతిభ కనబరుస్తున్న ఈ విభాగంలో ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరైంది కాదన్నారు. నిర్దిష్ట కాలం ప్రాతిపదికన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, మెడికల్ లీవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ చేసే వరకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలన్నారు. ఈ డిమాండ్లపై ఇప్పటికే అనేక సార్లు ఆందోళన చేపట్టామని, అయినా ప్రభుత్వంలో స్పందన లేదని, ఈ నేపథ్యంలోనే ప్రభుత్వానికి ఉద్యోగుల గోడు తెలియజేయడానికి రాష్ట్రవ్యాప్త సమ్మెను చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు సిహెచ్ భానుప్రకాష్, ఎ.దివాకర్, జి.రమేష్, వై.గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సర్వశిక్ష ఉద్యోగులు

విఆర్‌ఎల సమస్యలపై వినతులు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ నాయకత్వంలో ఆ సంఘం నాయకులు సత్తి కృష్ణ, రెడ్డి సింహాచలం, కొమ్ము నాగమణి, బోడయ్య కలిసి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం వినతి అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు రెవెన్యూ శాఖల్లో దిగువ స్థాయిలో పనిచేస్తూ ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి ఉన్నారని, శాఖ ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రధాన పాత్ర పోషిస్తున్నారని, గ్రామాల్లో నివసిస్తూ అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కారంలో రాత్రీ పగలు తేడా లేకుండా పనిచేస్తున్నారని అన్నారు. కావున వీరి సమస్యలు పరిష్కరించాలన్నారు. విఆర్‌ఎలకు పేస్కేల్ వర్తింప చేయాలని, ఖాళీగా ఉన్న విఆర్‌ఒ పోస్టులు విఆర్‌ఎల చేత భర్తీ చేయాలని, నామినీలుగా పని చేస్తున్న వారిని విఆర్‌ఒలుగా రెగ్యులర్ చేయాలని, సంక్షేమ పథకాలు విఆర్‌ఎలకు కూడా వర్తింపు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఈ డిమాండ్ చేశారు.

కొమరాడ : విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు కొల్లి సామమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేలో విఆర్‌ఎల సొంత గ్రామాలకు మాత్రమే పనులు ఇవ్వాలని, అక్రమ డ్యూటీలు చేయించరాదని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అశోక్, కృష్ణ, సోములు, నారాయణమ్మ, ప్రకాష్ పాల్గొన్నారు.

కురుపాం : సమస్యల పరిష్కారం కోరుతూ తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్‌కు విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు మండలంలో గల విఆర్‌ఎలతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని, నామినీ విఆర్‌ఎలను రెగ్యులర్ చేయాలని, పెంచిన డిఎ జిఒ విడుదల చేయాలని, తదితర అంశాలపై వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో విఆర్‌ఎల మండల అధ్యక్షులు జి.సరోజిని, పలువురు విఆర్‌ఎలు పాల్గొన్నారు.



కురుపాం : తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షులు ఈశ్వరరావు

సాలూరు :తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విఆర్‌ఎలు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. విఆర్‌ఎల సంఘం జిల్లా కోశాధికారి పాపారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన విఆర్‌ఎలు ధర్నా చేపట్టారు. రాష్ట్రంలో విఆర్‌ఎల సమస్యలు పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని చెప్పారు. అర్హులైన విఆర్‌ఎలను విఆర్‌ఒలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. అనంతరం హెచ్ డిటి భానుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

సాంకేతిక విద్యపై విద్యార్థులు ఆసక్తి చూపాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు సాంకేతిక విద్య అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నారని ఎంపిపి కె. దీనమయ్య అన్నారు. మండలంలోని తాడికొండ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్ లు పంపిణి చేశారు. ట్యాబ్‌లను విద్యార్థులు సక్రమంగా వినియోగించి చదువులో మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు రాధిక, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, బిసి రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, తాడికొండ, గుమ్మలక్ష్మీపురం సర్పంచులు ఎం.జగ్గారావు, బొత్తాడ గౌరీశంకరరావు, ఎంఇఒలు బి.చంద్రశేఖర్, బడే జనార్దన్ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: విద్యార్థికి ట్యాబ్ అందజేస్తున్న సర్పంచ్ స్రవంతి

భద్రగిరిలో.....స్థానిక గురుకుల బాలుర ఆశ్రమ పాఠశాల, పిటిజి బాలికల ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎల్విన్‌పేట సర్పంచి ఆర్.చైతన్య స్రవంతి బైజుస్ ట్యాబ్‌లు అందించారు. పేద విద్యార్థులకు అండగా ఉంటూ సాంకేతిక విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందించే ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.శ్యామల, ప్రిన్సిపాళ్లు వరప్రసాద్ బాబు, వెంకటేశ్వరరావు ఉన్నారు.

కొమరాడ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించే ట్యాబులను జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ నారాయణస్వామి మాట్లాడుతూ మండలంలో 8వ తరగతి విద్యార్థులకు 340 ట్యాబ్‌లు అందజేశామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎపిపి ఎం శరత్ బాబు, వైసిపి మండల కన్వీనర్ ద్వారపూడి జనార్దననాయుడు, డిసిఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ కె.మల్లిబాబు, సర్పంచులు, నాయకులు, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొమరాడ :విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న జెడ్‌పిటిసి లక్ష్మి


పార్వతీపురం రూరల్ : మండలంలోని నర్సిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సి హెచ్ బంగారమమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జిల్లా పార్టీ జనరల్ సెక్రెటరీ వి.గురురాజు, డిఇఒ ప్రేమ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లీ దండ్రులు, నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మోడల్ మండలంగా తీర్చిదిద్దాలి : ఆర్‌టిఎల్

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

మండలంలోని గొరడలో గురువారం ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు ఎల్ వన్, ఎల్ టు, ఎల్ త్రీలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రీజనల్ తిమోటిక్ లీడ్ (ఆర్‌టిఎల్) కె.ప్రకాష్ మాట్లాడుతూ మండలంలోని రైతులంతా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా సహజ సిద్ధంగా లభించే వనరులను ఉపయోగించుకొని, భూమిని సారవంతం చేసుకుని, ఆరోగ్యకరమైన పంటలు రైతులు తమకున్న పూర్తిస్థాయి విస్తీర్ణంలో పండించుకోవాలని సూచించారు. ప్రతి రైతు, కార్యకర్త తప్పనిసరిగా నిరుపయోగంగా ఉన్న బీడు, మెట్ట భూములను గుర్తించి వాటిలో నీటి ఎద్దడిని తట్టుకునే, తక్కువ నీటితో పండే పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా రైతులకు ఆదాయ వనరులు కల్పించాలని అన్నారు. సకాలంలో వర్షాలు కురవక, తగిన నీటి వనరులు లేకపోవడంతో పంటలు పండడం లేదని, పంట కీలక దశల్లో నీటి సౌకర్యం అందించలేకపోవడం వల్ల దిగుబడులు తగ్గిపోతున్నాయని తెలిపారు. నీటి ఎద్దడిని తట్టుకునే పంటల్లో ముఖ్యంగా ప్రతి 30 సెంటీ మీటర్ల విస్తీర్ణంలో తూర్పున సజ్జలు, దక్షిణాన అలసందలు, ఉత్తరాన గోరు చిక్కుడు, పడమరన అనుములు మధ్యలో ఆముదం / కంది, పంటలను విత్తుకోవడం ద్వారా కరువును తట్టుకోవడంతో పాటు ఆదాయం కూడా సంపాదించవచ్చునని అన్నారు. నేరుగా సిబ్బంది పంటల నమూనాలు అమలు చేయడం ద్వారా వారికి నమ్మకం కలుగుతుందని, తద్వారా రైతులకు అవగాహన కల్పించి వారికి ఈ నమూనా ఉపయోగపడేలా చేయగలమని తెలిపారు. కావున ప్రతి కార్యకర్త సాగులో లేని మెట్ట భూములను గుర్తించి వాటిలో ఈ విధమైన పంటల సాగును ప్రోత్సహించాలని కోరారు. రీజనల్ టెక్నికల్ అధికారి జి.హేమ సుందర్ మాట్లాడుతూ ప్రతి రైతు తమకున్న పూరిస్థాయి విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేయడానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, రబీ సీజన్‌లో వేసే పంటల గురించి డెమో చూపించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు (డిపిఎం) పి.షణ్ముఖరాజు మాట్లాడుతూ రైతులకు కార్యకర్తలు అందుబాటులో ఉండి పూర్తి విస్తీర్ణంలో రబీలు పంటలు వేయాలని అన్నారు. జిల్లాలోని రైతులంతా ఏడాది పొడవునా పంటలు పండించేలా కార్యకర్తలు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఎ దేవీప్రసాద్, జి.అన్నపూర్ణ, శోభ, మండల్ ఇన్చార్జి సీతారాం, జగదీష్, మిన్నారావు, రామారావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్ పుట్టినరోజు వేడుకలు



సీతంపేట : వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కళావతి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు జిల్లాలో పలుచోట్ల ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా పార్వతీపురం పట్టణంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమక్షంలో గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సిఎం పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కళాశాలలో మొక్కలు నాటారు. మహిళలకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. తొలుత భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మూడు మండలాలు, మున్సిపాల్టీ పరిధిలోని ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని గొయిదిలో సిఎం జన్మదిన వేడుకలు స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతంపేట ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బి ఆదినారాయణ, వైస్ ఎంపిపిలు, కె.సరస్వతి, మూటక విజయలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు లక్ష్మి, పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : సిఎం జగన్మోహన్ రెడ్డి జన్మదిన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వైసీపీ శ్రేణులు స్థానిక రావాడ కూడలిలో గల వైయస్సార్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్ చేసి బాణసంచా పేల్చి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో స్థానిక మేజర్ పంచాయతీ సర్పంచ్ జి. సుజాత , సర్పంచ్ షేక్ ఆదిల్, జడ్పిటిసి జి. సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, మండల కన్వీనర్ ఐ. గౌరీ శంకర్ , మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, వైసిపి జిల్లా వాణిజ్య విభాగాల అధ్యక్షులు అందవరపు కోటేశ్వరరావు, వైసిపి మైనార్టీ విభాగ నాయకులు షేక్ నూరేళ్ల, మండలంలోని పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలోని కొటికిపెంట పంచాయితీ గోగాడవలసలో సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో సిఎం జగన్ మోహన్ రెడ్డి 52వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ చేతుల మీదుగా కేక్ కట్ చేసిన అనంతరం పేదలకు చీరలు, దుప్పట్లు, పండ్లు, చిన్నారులకు చాక్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాలకొండ : సిఎం జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ విప్ విక్రాంత్ ఇంటి వద్ద కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. అంతకుముందు విప్ విక్రాంత్ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, సీనియర్ నాయకులు ధవళేశ్వరరావు, విశ్రాంత కమీషనర్ లిల్లీ పుష్పనాథం, హనుమంతరావు, కౌన్సిలర్లు, సర్పంచులు అందరూ కలిసి స్థానిక కార్గిల్ కూడలి దగ్గర ఉన్న వైఎస్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పాలవలస రాజశేఖరం ఇంటికి చేరుకుని అక్కడ రాజశేఖరం ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

గరుగుబిల్లి: సిఎం జగన్ జన్మదినం సందర్భంగా ఎంపిపి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు వైఎస్ విగ్రహానికి పాలాభిషేకంతో పాటు పూలమాలలు వేశారు. అనంతరం జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. అలాగే పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి, తోటపల్లి ఆలయాల ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మర్రాపు సత్యనారాయణ, మాజీఎంపిపి ద్వారపురెడ్డి ధనంజయరావు, రౌతు రామినాయుడు, నేరేడుమిల్లి జనార్ధననాయుడు, నల్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



పాచిపెంట : పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

ప్రజాశక్తి-పాలకొండ

జిల్లా రేగిడి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రంప సుధాకర్‌ది గుండె పోటు మరణం కాదని, అది ప్రభుత్వ పోటు అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా అధికారులు అకారణంగా సుధాకర్‌ను సస్పెండ్ చేశారని, దీంతో ఆయన తీవ్ర మనోవేదన పడుతూ బుధవారం రాత్రి గుండె పోటుకు గురై చనిపోయారని అన్నారు. అలాగే ఉపాధ్యాయుల పిఆర్‌సి ఎరియర్, డిఎ బకాయిల కోసం ఈ నెల 27న పోరాటం చేస్తామన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సాయంత్రం ఐదు గంటల నుండి ఎనిమిది గంటల వరకు ఆందోళన ఉంటుందని, ఈ పోరాటాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పైడిరాజు, నాయకులు నాగేశ్వరరావు, కాంతారావు, గోవిందరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వార్షిక తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో దోనుబాయి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గురువారం ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ ఎ.లిల్లీరాణి వార్షిక తనిఖీ చేపట్టారు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టిక, స్టాక్ రిజిస్టర్ అన్ని రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. ఈ ఏడాది పదవ తరగతిలో శత శాతం సాధించాలని అన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కొండగొర్రి సుబ్బారావు, డిప్యూటీ వార్డెన్ వి.గణపతిరావు, సీనియర్ సహాయకులు లాభాల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మక్కువ : విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న హెచ్‌ఎం, జెవివి ప్రతినిధులు

చెకుముకి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ

ప్రజాశక్తి - సీతానగరం

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో మండలంలోని నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. విజేతలు జనవరి 7న జరుగు జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించిన ఉపాధ్యాయులు సతీష్, రాజును హెచ్‌ఎం ఎం.శివునాయుడు అభినందించారు.

మక్కువ: చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా జెవివి ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8,9,10వ తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. 570మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. అందులో 21మంది విద్యార్థులు మండలస్థాయి పరీక్షకు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో జెవివి ప్రతినిధులు రమేష్, రామారావు, రాంబాబు, పి.మధు, యుటిఎఫ్ నాయకులు శివప్రసాద్, సంతోషి కుమారి స్థానిక హెచ్‌ఎం హేమలత తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలంలోని అన్ని హైస్కూల్ నుంచి ఆయా పాఠశాల స్థాయి జరిగిన చెకుముకి పరీక్షల్లో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.సుంభరో ఆధ్వర్యంలో నిర్వహించిని కార్యక్రమంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షులు గౌరీశ్వరరావు, మండల బాధ్యులు ఎస్ సతీష్, కార్యకర్తలు పి వెంకటేశ్వరరావు , వి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జెవివి గౌరవాధ్యక్షులు బివి రమణ ఆధ్వర్యం లో జరిగిన ఈ టెస్టులో జరిగాయి. కార్యక్రమంలో ఎంఇఒ కె.సోంబాబు, ప్రధానోపాధ్యాయులు ఎం. సూర్యనారాయణ, ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సూర్యనారాయణ, సమత కన్వీనర్ శీమల శశిరేఖ, వివిధ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఎన్ లక్ష్మీ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం : విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

నేరాలు ఘోరాలు

చెట్టును ఢీకొన్న ఆటో : 16 మందికి గాయాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



చెట్టును ఢీకొన్న ఆటో

మండలంలోని లోవ ముఠా ప్రాంతమైన దుడ్డుఖల్లు పంచాయతీ కంబగూడ సమీపాన ఆటో చెట్టుకు ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న 16మంది గిరిజనులకు ముఖం, కాళ్లకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని సమీపంలో ఉన్న దుడ్డుఖల్లు పిహెచ్‌సికి తరలించి మెరుగైన వైద్యం కోసం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వరి కోతల నిమిత్తం దేరువాడ నుంచి కురుపాం వెళ్తుండగా కంబగూడ సమీపంలో ఎదురుగా వస్తున్న మోటారు బైక్‌ను తప్పించే క్రమంలో ఎదురుగా ఉన్న చెట్టుకు ఆటో ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఆటో ప్రమాద సమయంలో 28మంది ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. స్వల్పంగా గాయపడిన వారిని దుడ్డుఖల్లు పిహెచ్‌సిలో వైద్యం అందిస్తున్నారు. ఎవరికి ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రానికి సమీపాన గల భారత్ గ్యాస్ గోడౌన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వై.రాజారావు అనే ప్రభుత్వ ఉద్యోగి చిదిమిలో విఆర్‌ఒ విధులు నిర్వహిస్తున్నారు. ఎప్పటిలాగే చిదిమిలో విధులు నిర్వహించుకొని ద్విచక్ర వాహనంపై తిరిగి వీరఘట్టం వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు బైకును ఢీకొట్టడంతో రాజారావుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని వైద్యం కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో గుర్తుతెలియని దొంగలు బైక్‌పై వచ్చి మహిళ మెడలో పుస్తెలతాడు తెంపుకొని పారిపోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. గురువారం స్థానిక సౌందర్య థియేటర్ వెనుక ఉన్న టీచర్స్ కాలనీకి చెందిన తాన్న కృష్ణవేణి (65) సాయిబాబా గుడికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా బైపాస్ కాలనీలో ఉన్న అజయ్‌నగర్ వద్ద ఎవరూ లేని సమయాన్ని చూసుకొని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి మహిళ మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును తెంపుకుని పారిపోయారు. పట్టణ పోలీస్ స్టేషన్లో మహిళ ఇచ్చే ఫిర్యాదు మేరకు పట్టణ సిఐ కృష్ణారావు, ఎస్‌ఐ సంతోషి కుమారి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరి మహిళలే లక్ష్యం

పట్టణంలో గత కొన్ని నెలలుగా ఒంటరి మహిళలనే లక్ష్యంగా పెట్టుకుని దొంగలు ద్విచక్ర వాహనాలపై వచ్చి చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతుండడంతో మహిళలు ఒంటరిగా రోడ్డుపైకి రావాలంటేనే భయపడుతున్నారు. తరచూ జరుగుతున్న సంఘటనలపై పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పలు కూడళ్లలో గస్తీని ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని, పట్టణ ప్రజలు కోరుతున్నారు.